క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా తెనాలి పట్టణంతో పాటు మండల గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏడీఈ బి. అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఐలా క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిరూరల్: తెనాలి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐలా) నూతన సంవత్సర కోర్టు కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కోర్టుల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు గారు, జాయింట్ సెక్రటరీ అప్పల కిషోర్, సీనియర్ న్యాయవాదులు పిల్లి సుధాకర్, ఎంఎల్ జగదేశ్వరాంబ, గువ్వల పద్మావతి, ఇతర మహిళా న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలి: పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. పట్టణంలోని ఒకటో డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్యం పనితీరును పరిశీలించారు. శానిటేషన విభాగంలోని వర్కర్లతో మాట్లాడారు. తగిన సూచనలు చేశారు. అనంతరం పట్టణ 39, 19, 20వ వార్డులను సందర్శించారు. 34వ వార్డులో జరుగుతున్న గ్యాంగ్ వర్క్‌ను పరిశీలించి, తగిన సూచనలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉపాధి యూనిట్లతో ఆర్థిక స్వావలంబన



తెనాలి: పట్టణంలోని జైభీమ్ ఫెడరేషన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం సంఘ సభ్యులకు వ్యాపార అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల్లో భాగస్వాములైన ఉపాధి యూనిట్లను నెలకొల్పి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటైన సమావేశంలో జైభీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కటివరపు దేవానంద్ మాట్లాడారు. వివిధ వత్తులు, వ్యాపార అవకాశాలనూ ఆయన వివరించారు. బ్యాంకు మేనేజర్లు, వ్యాపార సంస్థలను సంప్రదించి, వారి సలహాలు, సూచనలను సభ్యులకు వివరించారు. జైభీమ్ ఫెడరేషన్‌లో ఉన్న ప్రతి సభ్యుడికి ఉపాధి కల్పించాలనేది ముఖ్య ఉద్దేశమని చెప్పారు. సభ్యులు ప్రతిఒక్కరూ ఏదొక వ్యాపారాన్ని ప్రారంభించి అభివృద్ధి చెందాలని సూచించారు. అవసరమైన సలహాలు, సూచనలు, సహకారాన్ని ఫెడరేషన్ అందిస్తుందని చెప్పారు.

నగరం వీఆర్వో గుండెపోటుతో మృతి

నగరం: నగరం వీఆర్వోగా పనిచేస్తున్న మోపిదేవి బాలకోటేశ్వరరావు (43) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. విధులకు హాజరయ్యేందుకు రేపల్లె నుంచి నగరం వస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాలకోటేశ్వరరావు మృతి పట్ల నగరం తహసీల్దార్ నాంచారయ్య, రెవెన్యూ సిబ్బంది ద్రిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. బాలకోటేశ్వరరావు ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడిగా పనిచేశారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతి ఏపీసీపీఎస్ఈఏకు తీరని లోటని జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ అన్నారు. బాలకోటేశ్వరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విస్తృతంగా విద్యుత్ తనిఖీలు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, విద్యుత్ విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు చెప్పారు. శుక్రవారం ఉదయం ఎస్ఈ ఆంజనేయులు, విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన విద్యుత్ ఏఈలు, సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి మండల పరిధిలో 3,650 సర్వీసులు తనిఖీలు చేశారు. 398 సర్వీసులకు సంబంధించి అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించామని తెలిపారు.

యడ్లపల్లి కాల్వ మురుగుమయం...

కాల్వ నిండా వ్యర్థాలే! పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

పట్టణ మురుగును పంట కాల్వలోకి వదిలి చేతులు దులుపుకున్న మున్సిపల్ అధికారులు



మురుగుమయంగా ఉన్న యడ్లపల్లి కాల్వ

తెనాలిరూరల్: పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి పంట కాల్వలు పూర్తిస్థాయి మురుగు కాల్వలుగా మారింది. అసలుకే ఆశించిన దిగుబడులు లేక ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు మురికి కూపాలుగా ఉన్న పంట కాల్వలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఏ కాల్వ చూసినా మురుగు మయంగా మారడంతో ఆ నీళ్ల పొలాలకు పెడితే దిగుబడి తగ్గుతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వ శాఖల్లో సమన్వయం లోపించడం వీరి ఆందోళనకు కారణమవుతోంది. పంట కాల్వల క్రీడాస్థలిగా పేరుగాంచిన తెనాలిలో ప్రస్తుతం ఒక్క నిజాంపట్నం కాల్వ మినహా మిగిలిన కాల్వలన్నీ మురుగు కూపాలుగా తయారయ్యాయి. పట్టణ పరిధిలో ఎక్కడికక్కడ మురుగును కాల్వలోకి వదులుతున్నా అటు నీటి పారుదల, ఇటు మున్సిపల్ శాఖల అధికారులు తమదేం పోయిందన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కాల్వలన్నీ మురుగుతో నిండి పోతున్నాయి.

పూర్తిగా మురుగు కాల్వగా మారిన వైనం!

పడమర కాల్వ నుంచి వచ్చే యడ్లపల్లి కాల్వ చంద్రబాబునాయుడు కాలనీ మీదుగా వెళుతుంది. ఈ పంట కాల్వ మీద ఆధారపడి దాదాపు 500 ఎకరాల్లో సాగు జరుగుతుంది. మల్లెపాడు డ్రెయిన్‌ను నిర్మించిన మున్సిపల్ అధికారులు మల్లెపాడు శివారులోని కల్లుగుడిసెల వద్ద దీన్ని యడ్లపల్లి కాల్వలోకి కలిపి చేతులు దులుపుకున్నారు. అలాగే చంద్రబాబు నాయుడు కాలనీ మురుగంతా ఈ కల్వలోకే వదిలేశారు. పినపాడు, మారిస్‌పేట ప్రాంతాల మురుగంతా ఈ డ్రెయిన్ ద్వారా కాల్వలో కలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతమంతా మురుగుతో నిండిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. కొత్తగా ఈ కాల్వ వైపు వచ్చిన వారు ఇది పంట కాల్వ అనుకునే దాఖలాలు అస్సలు లేకుండా పోయాయి.

కాల్వ నిండా తూటికాడ, ప్లాస్టిక్ వ్యర్థాలు..

డెల్టాలో క్వాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. వ్యవసాయ సీజను ప్రారంభానికి ముందే చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. యడ్లపల్లి కాల్వ పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాలు, తూటికాడతో నిండిపోయింది. పట్టణంలోని మారిస్‌పేట, పినపాడు ప్రాంతంల్లో మురుగు కాల్వల్లో వేస్తున్న వ్యర్థాలు యడ్లపల్లి కాల్వలోకి చేరుకోవడంతో గుట్టలు గుట్టలుగా నిండి పోతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఓ వైపు మున్సిపల్ అధికారులు ప్రకటనలు చేస్తున్నా, ఇళ్ల నుంచి రెండు బుట్టల విధానంలో చెత్త సేకరణ జరుగుతున్నా, పంట కాల్వ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతుండడం గమనార్హం. కాల్వలనీన ఈ స్థితిలో ఉంటే, ఒక వేళ సాగు నీరు వదిలినా పొలాలకు ఈ మురుగునీరే చేరుతుంది. దీంతో కాల్వకింద సాగులో ఉన్న పొలాల రైతుల్లో ఆందోళన ఉంది. అటు ఇరిగేషన్ అధికారుల కానీ ఇటు మున్సిపల్ అధికారులు కానీ కాల్వల దుస్థితిపై నోరు మెదపడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేయాల్సి వస్తుందని మున్సిపల్ అధికారులు కిమ్మనడంలేదు. తమదేం పోయిందిలే అన్నట్టు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రైతులు పీడితులవుతున్నారు.

కాల్వల్లో మురుగుతో రైతులకు నష్టం



పంట కాల్వల్లోకి మురుగు నీరు కలవడం వల్ల వ్యవసాయదారులు నష్టపోతారు. యడ్లపల్లి కాల్వ, పినపాడు కాల్వల్లో మొత్తం మురుగే పారుతోంది. పట్టణంలో మురుగంతా ఈ కాల్వల్లోకి వదిలేశారు. దీని వల్ల పంటల్లో చీడపీడలు ఎక్కువవడంతో పాటు దిగుబడి తగ్గుతుంది. కాల్వలను బాగు చేయాల్సిన అవసరం ఉంది.

–పినపాటి యోహాను, కౌలు రైతు, మల్లెపాడు



యడ్లపల్లి కాల్వలో కలుస్తున్న మల్లెపాడు డ్రెయిన్, చంద్రబాబు కాలనీ డ్రెయిన్‌లు



తూటికాడతో నిండిన కాల్వ

మెగా జాబ్ మేళాలో ఉద్యోగావకాశాలు



తెనాలి: స్థానిక ఎన్నారై డిగ్రీ కాలేజీలో జరిగిన మెగా జాబ్‌మేళాలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 111 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలను సాధించినట్టు కాలేజీ సీఈవో సీహెచ్ ఉమా మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వీరిని సీఈవోతోపాటు ప్రిన్సిపాల్ ఎం.లాజర్‌బాబు, ఎన్నారై జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్ ఎస్.శివన్నారాయణ, కె.కృష్ణారెడ్డి, స్కూల్ డీన్ వి.కిషోర్, ట్రైనర్ టి.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

పెన్నీ మినిస్ట్రీస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



తెనాలిరూరల్: రూరల్ మండలం పెదరావూరులోని పెన్నీ మినిస్ట్రీస్ కార్యాలయంలో కుష్టు రోగుల కోసం ప్రత్యేకంగా సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ లేనివారికి నూతన వస్త్రాలు, భోజనం పెట్టడంలో యేసుక్రీస్తు చెప్పిన బోధనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నటుడు మిలటరీ ప్రసాద్ అధ్యక్షత వహించారు.

అక్రమంగా విద్యుత్ వినియోగం నేరం

డీఈఈ రాజశేఖర్



మాట్లాడుతున్న డీఈఈ రాజశేఖర్

కొల్లిపర: విద్యుత్ మీటర్ ద్వారా వినియోగదారులకు అనుమతి ఇచ్చిన విద్యుత్ వినియోగం కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగించటం, అక్రమంగా విద్యుత్ వినియోగించటం చట్టపరంగా నేరమని అటువంటి వినియోగదారులపై కేసులు నమోదు చేసి పెనాల్టీలు వేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ రాజశేఖర్ అన్నారు. మండలంలోని తూములూరు, కొల్లిపర గ్రామాల్లో అధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఆకస్మికంగా విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సబ్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ తనిఖీలు నిర్వహించగా 50 మంది విద్యుత్ వినియోగదారులపై కేసులు నమోదు చేసి వారికి సుమారు రూ.2 లక్షలు అపరాధ రుసుమును విధించినట్లు తెలిపారు. వినియోగదారులు మండలంలో విద్యుత్ బిల్లులు కట్టించుకొనే బిల్లుకలెక్టర్ గడువు ముగిసిపోవటంతో ఈనెల రావటం లేదు మేం ఎలా బిల్లులు కట్టాలి అని తనిఖీ కి వచ్చిన డీఈఈవో దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ఉన్నత అధికారులతో మాట్లాడారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఈ విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోగా వారు స్పందించి రేపటి నుంచి బిల్‌కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. మండలంలో గతంలో ఎలాగైతే వినియోగదారులు ఆయా గ్రామాల్లో ఆయా తేదీల ప్రకారం బిల్‌కలెక్టర్ వస్తారని అతనికి యధావిధిగా విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్, సబ్ ఇంజనీర్ సత్యన్నారాయణ, సుంకర ప్రసాద్, తూములూరు లైన్‌మాన్ చల్లా ఉమామహేశ్వరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గోపాలకృష్ణ



అర్జీదారుతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలడుగు జయ నాగలక్ష్మి, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్తులు, రైతులు తమ తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సదస్సులో రైతులు వారికి సంబంధించిన పలు సమస్యల్ని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, అలానే ప్రజా సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి దేవదాయ శాఖకు సంబంధించి 49, మ్యుటేషన్ కోసం ఒకటి, సర్వే కోసం రెండు అర్జీలు వచ్చాయి. దేవదాయ శాఖ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు

భట్టిప్రోలు: నీటి సంఘాల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో పెదపులివర్రు, సూరేపల్లి, భట్టిప్రోలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఈ ఎన్నికలు ఆయా గ్రామాల్లోని హైస్కూళ్లలో నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు చెప్పారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆయా ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో సంఘానికి సంబంధించి 12 టీసీలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టీసీ ఎన్నికకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా నీటి తీరువా, భూమి శిస్తు బకాయిలు లేకుండా ఉండాలని అలాగే ఓటు హక్కు కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ వీటిలో ఏదో ఒకటి చూపి ఎన్నికకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారి, సహాయ అధికారి, పీవో, ఏపీవోలు అందుబాటులో ఉండి ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరిగే భట్టిప్రోలు టీఎంరావు, పెదపులివర్రు జెడ్పీ హైస్కూల్స్‌ను తహసీల్దార్ సందర్శించారు. ఆయన వెంట ఆర్ఐ ఫణికుమార్, హెచ్ఎం ఎండీ సుభాని, చందలూరి రామకోటేశ్వరరావు, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

కొల్లూరు: నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయినట్లు నీటిపారుదల శాఖ ఏఈ సాంబశివరావు పేర్కొన్నారు. కొల్లూరు నీటిపారుదల శాఖ సెక్షన్ పరిధిలోని అనంతవరం, కుశ్చళపాడు, ఈపూరు, రావికంపాడు, దోనేపూడి, కొల్లూరు, పెదపులివర్రు నీటి సంఘాలకు నిర్వహించనున్న ఎన్నికల్లో ఒక్కో సంఘంలో 12 మంది టీసీలకు ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు టీసీల ఎన్నికలు జరగనున్నయన్నారు. అనంతవరం నీటి సంఘానికి అనంతవరం జెడ్పీ హైస్కూల్, కుశ్చళపాడు సంఘానికి వేమూరు జెడ్పీహైస్కూల్, ఈపూరు సంఘానికి చిలుమూరు శ్రీరామ రూరల్ విద్యా సంస్థలు, రావికంపాడు సంఘానికి కొల్లూరు బాలికోన్నత పాఠశాల, దోనేపూడి సంఘానికి దోనేపూడి జెడ్పీహైస్కూల్, కొల్లూరు సంఘానికి కొల్లూరు బాలురోన్నత పాఠశాల, పెదపులివర్రు సంఘానికి పెదపులివర్రు జెడ్పీహైస్కూల్‌లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. టీసీల ఎన్నికల అనంతరం మధ్యాహ్నం నుంచి డబ్ల్యూఏ అధ్యక్షుడి ఎన్నిక జరగనున్నట్లు పేర్కొన్నారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు

తెనాలిరూరల్: కిశోర బాల్లి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక కొత్తపేటలోని రామకృష్ణకవి కళా క్షేత్రంలో నిర్వహించారు. ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడి, ఇతర శాఖల సిబ్బందికి నిర్వహించిన సదస్సుకు సీడీపీవో ఎం. సునీత అధ్యోత వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. 11 నుండి 18 ఏళ్ల వయసులో ఉన్న బాలికల వికాసం గురించి అన్ని శాఖలు సంయుక్తంగా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. బాలికలలో రుతుక్రమ పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, బాలలపై లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, బాలల హక్కులు, స్వీయ రక్షణ, యోగ, జీవనోపాధి అవకాశాలు వంటి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి శిక్షణ నిచ్చారు. జిల్లా డీసీపీవో విజయ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఓ. సౌజన్య, హిమబిందు, ఎస్ఏ నాగమణి, ఎంపీహెచ్ఓ రాజయ్య, మండల స్థాయి ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్లు యానాదమ్మ, వెంకట రమణ, గ్రామ/వార్డు స్థాయి మహిళా పోలీసులు, వార్డు/గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



రేపల్లె రూరల్: ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈవో రత్నశేఖర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, సూర్యలు మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో కూడా పూర్తిగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. ర్యాంకుల కోసం అదనంగా తరగతులు నిర్వహిస్తూ విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

తహసీల్దారు జి.సిద్ధార్థ

కొల్లిపర: నేడు మండలంలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు జి.సిద్ధార్థ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల పీఓలు, ఏపీఓలు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 6 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. వాటిలో వల్లభాపురం, మున్నంగి, అత్తోట, చివలూరు, కొల్లిపర, తూములూరు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డుతో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల లోపు రావాలని సూచించారు. 9 గంటల తరువాత పోలింగ్ కేంద్రాల లోపలకు అనుమతి ఇవ్వటం జరగదన్నారు.

9 గంటల నుంచి 1 గంట వరకు ఎన్నికలల్లో ఎవరు పోటీ చేస్తారు అన్న అంశాలను పరిశీలించి ఓటింగ్ పక్రి య మొదలు పెట్టం జరుగుతుందన్నారు. 3 గంటల నుంచి 5 గంటల లోపు గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించి, వారిలో నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎవరు అన్న అంశాలను పరిశీలించి, అధికారికంగా ఎన్నికైన అభ్యర్థులను ప్రకటించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు ఉప్పల రాజేష్, ఆర్ఐ వంశీ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే మనందరి లక్ష్యం

ఎంపీపీ పద్మావతి



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: పంచాయతీల అభివృద్దే లక్ష్యమని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 2వ బ్యాచ్ రెండో రోజు ఎంపీడీవో వి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాండర్డ్ డెవలప్‌మెంట్ గోల్(ఎల్‌డీజీ) కార్యక్రమానికి ఎంపీపీ పద్మావతి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు 17 అంశాలతో కూడిన ఈ అభివృద్ధి లక్ష్యాలను పాటించడం వల్ల పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిపించడానికి అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో విజయలక్ష్మి పంచాయతీల అభ్యున్నతికి పాటుపడే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఈవోపిఆర్డీ సి.హెచ్.భార్గవ, ఎంపీహెచ్ఓ వి.లక్ష్మి, ఐసీడీఎస్ అధికారి కె.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.సుధాకర్, ఎంపీఎం పి.రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా విద్యుత్ తనిఖీలు



మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు, విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, విద్యుత్ విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు చెప్పారు. శుక్రవారం ఉదయం ఎస్ఈ ఆంజనేయులు, విజిలెన్స్ ఏడీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన విద్యుత్ ఏఈలు, సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి మండల పరిధిలో 3,650 సర్వీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్ అధికారులు మాట్లాడుతూ మండలంలో 398 సర్వీసులకు సంబంధించి అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి సుమారు రూ.15 లక్షల జరిమానా విధించామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పొదుపుగా విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి ఏడీ విజయ్‌శ్రీనివాస్, పిట్టలవానిపాలెం ఏఈ చంద్రశేఖర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడిపుంజు విషయంలో వాగ్వివాదం.. దాడి

భట్టిప్రోలు: కోడిపుంజు విషయంలో ఇరువురు వాగ్వివాదానికి దిగి దాడి చేసుకున్న వైనమిది. భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య కథనం ప్రకారం గురువారం మండలంలోని పెదలంక మధ్యగూడెంకు చెందిన కొల్లూరు నవీన్ తన కోళ్లను అదే గ్రామానికి చెందిన నన్నెపాముల దివ్య కుమార్ తీసుకువెళ్లాడని తెలిసి అడిగితే అసభ్య పదజాలంతో తిట్టడమే కాక దాడి చేసినట్లు తెలిపారు. దాడికి గురైన ఫిర్యాదుదారుడు నవీన్ రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



రేపల్లె రూరల్: పట్టణంలో దోమలనివారణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ చెప్పారు. దోమల నివారణకు ఏర్పాటు చేసిన ఫాగింగ్ వాహనం, మిషన్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులకు కారణమైన దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఫాగింగ్ నిర్వహణకు అత్యాధునిక యంత్రాలను కొనుగోలు చేసి నిత్యం పట్టణంలో సంచరించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు సైతం తమ పరిసరాలలో దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.